# బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ బాల్క సుమన్
- పార్టీలో పెద్దసంఖ్యలో చేరిక




రామకృష్ణాపూర్ : బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ బాల్క సుమన్

రామకృష్ణాపూర్, నవంబర్ 27: బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని స్వగృహంలో సోమవారం మండల పరిధిలోని పులిమడుగు, రామకృష్ణాపూర్, అమరవాది, వెంకటాపూర్, గుడిపెల్లి గ్రామాలకు చెందిన 500 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి విప్ సుమన్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గాన్ని గతంలో ఎవరూ పట్టించుకోలేదన్నారు. తనను ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించిన తర్వాత నాలుగున్నరేండ్లలో వేలాది కోట్ల నిధులను తీసుకు వచ్చి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. చెన్నూర్ పరిసర గ్రామాలకు వానకాలంలో సంబంధాలు ఉండేవి కావని, ప్రజల కష్టాలను గుర్తించి 22 వాగులపై వంతెనలు నిర్మించామని తెలిపారు. మరోసారి అవకాశం ఇస్తే నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. యువకులు తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. ఈ నెల 30న జరగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మందమర్రి జడ్పీటీసీ వేల్పుల రవి, నాయకులు డాక్టర్ రాజారమేశ్, అందుగుల శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కౌన్సిలర్

చెన్నూర్, నవంబర్ 27: చెన్నూర్ మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ చిలకమారి శరణ్య, ఆమె భర్త రాకేశ్‌తో పాటు 100 మంది అనుచరులు బీఆర్ఎస్‌లో చేరారు. సోమవారం చెన్నూర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చెన్నూర్ పట్టణంలో బాల్క సుమన్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నవాజోద్దిన్, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కోటపల్లి, నవంబర్ 27 : కోటపల్లి మండలం సిర్సా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వర్శబోయిన సుధాకర్ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

### మందమర్రి మండలంలో ప్రచారం

మందమర్రి రూరల్ నవంబర్ 27 :మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరించారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో చెన్నూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి బాల్క సుమన్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.




చెన్నూర్: కౌన్సిలర్ శరణ్యకు కండవాను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్



కోటపల్లి : కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌కు బీఆర్ఎస్ కండువా కప్పుతున్న బాల్క సుమన్



మందమర్రి రూరల్: శంకర్ పల్లెలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు




## మున్నూరు కాపుల అభ్యున్నతికి కృషి

- పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని
- బీఆర్ఎస్‌కు మున్నూరు కాపు సంఘం మద్దతు



మాట్లాడుతున్న పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని

మందమర్రి, నవంబర్ 27: మున్నూరు కాపుల అభ్యున్నతి, వారి సంక్షేమ కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకానీ అన్నారు. సోమవారం మందమర్రిలోని శ్రీ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు.ఎన్నికల్లో మున్నూరు కాపులకు బీఆర్ఎస్ పార్టీ 12 ఎమ్మెల్యే స్థానాలను కేటాయించిందని, రాజ్యసభలను మున్నూరు కాపులకు అవకాశం కల్పించారన్నారు. చెన్నూరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్‌కు మందమర్రి మున్నూరు కాపు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజరాం, మేడిపల్లి సంపత్, బొరిగం వెంకటేశ్, రాకం సంతోష్, లక్ష్మణ్, ఇప్ప సమ్మయ్య, సంగర్తి సంతోష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ రోడ్డుషోకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



మందమర్రి : చెన్నూర్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, నవంబర్ 27 : ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం చెన్నూర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారక రామారావు రోడ్‌షోకు మందమర్రి మున్సిపాలిటీ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు, మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు, యువకులు, సోషల్ మీడియా వారియర్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలతో పాటు వారి సొంత వాహనాలలో వెళ్లారు. జై బీఆర్ఎస్ జై కేసీఆర్, జై కేటీఆర్, జై బాల్క సుమన్ నినాదాలతో హోరెత్తించారు.

కోటపల్లి, నవంబర్ 27 : చెన్నూర్‌లో సోమవారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్డు షోకు కోటపల్లి మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసుకొని బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ విజయాన్ని ఆకాంక్షిస్తూ జై బీఆర్ఎస్ నినాదాలు చేస్తూ చెన్నూర్‌కు పయనమయ్యారు.



కోటపల్లి: రొయ్యలపల్లి నుంచి చెన్నూర్‌కు బయలుదేరుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

## కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్

గర్మిళ్ల, నవంబర్ 27: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు – 2023 సందర్భంగా ఈ నెల 30న ఎన్నికలు ఉన్నందున పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు 28 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 1వ తేదీ ఉదయం 7 గంటల వరకు రామగుండం కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్ పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులు గుంపులుగా తిరగవద్దని తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, గుర్తులు, ప్లకార్డులు, ధరించవద్దని, ప్రదర్శించరాదని పేర్కొన్నారు. మైకులు, లౌడ్ స్పీకర్లు, వాడరాదని, రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు, ఉపన్యాసాలు ఇవ్వకూడదని, విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ధర్నాలు, రాస్తోరోకోలు, ఊరేగింపులు, పటాకులు కాల్చడం లాంటి కార్యక్రమాలు చేయరాదని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.